### వంద రోజుల్లోనే కరువును తెచ్చిన కాంగ్రెస్



తెలంగాణ రాక ముందు కరెంట్ కష్టాలు, ఆకలి చావులు, బీడు భూములు, కరువు ప్రాంతంగా ఉండేది. రాష్ట్రం వచ్చిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం సాగు రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చి దేశానికే అన్నం పెట్టేలా రాష్ట్రాన్ని తీర్చిదిద్దింది. అన్ని రంగాల్లో చక్కబెట్టి కాంగ్రెస్‌కు అప్పగిస్తే చెరువులు, కుంటలను ఎండగొడుతున్నది. వంద రోజుల పాలనలో కరువును తెచ్చిపెట్టింది. పంట చేన్లు బీళ్లుగా మారిపోతున్నాయి. సాగు నీరందక పంటలు ఎండిపోయి రైతులు కన్నీరు పెడుతున్నా రేవంత్ సర్కార్ కనికరించడం లేదు. పంటలు చేతికిరావాలంటే నెల పడుతున్నది. కానీ ప్రభుత్వం ఈ నెల 2తో ఆఖరి తడి ఇచ్చి చేతులెత్తేయబోతున్నది. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఎండిన పంటలకు ఎకరాకు రూ.25 వేల నష్ట పరిహారం చెల్లించాలి. రైతు బంధు విడుదల చేయాలి. రూ.500 బోనస్ చెల్లించాలి. **- బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్**

# రైతన్న కన్నీరు తుడిచేందుకు..

## ఈ నెల5న కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లో కేసీఆర్ పర్యటన

- ఎండిన వరి పంటలను పరిశీలించనున్న బీఆర్ఎస్ అధినేత
- అన్నదాతకు ధైర్యం కల్పించేందుకు రాక
- కరీంనగర్ రూరల్ నుంచి మొదలవనున్న పర్యటన
- రైతుల సమస్యలపై వారితో ముఖాముఖి
- వెల్లడించిన ఎమ్మెల్యే గంగుల కమలాకర్





ప్లకార్డులను చూపుతున్న మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్, మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, దాసరి మనోహర్‌రెడ్డి, నాయకులు రవీందర్‌సింగ్, రఘువీర్ సింగ్, తదితరులు



# రైతు నోట్లో మట్టికొడితే తరిమికొడతాం

- కాంగ్రెస్ పాలనలో ఆగమైన ఎవుసం
- అన్నదాతను ఆదుకునేదాకా పోరుబాట వీడం
- మేం నిద్రపోం.. రేవంత్ సర్కార్‌ను నిద్రపోనివ్వం
- ఎండిన పంటలకు పరిహారమిచ్చేదాకా ఊరుకోం
- వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- పెద్దపల్లిలో ముగిసిన 36 గంటల రైతు నిరసన దీక్ష
- మాజీ మంత్రి కొప్పుల, జడ్పీ చైర్మన్ పుట్ట, మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి, దాసరికి నిమ్మరసం ఇచ్చి విరమింపజేసిన సింగిరెడ్డి

పెద్దపల్లి, మార్చి 31(నమస్తే తెలంగాణ)/పెద్దపల్లి: ''అలవికాని హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కారు.. సాగునీరివ్వకుండా.. రైతుబంధు జమచేయకుండా.. ఆరుగాలం కష్టపడ్డ రైతు నోట్లో మట్టిగొడుతున్నది..'' అని వ్యవసాయశాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అన్నదాతను దగా చేస్తున్న రేవంత్ సర్కారును తరిమికొడతామని హెచ్చరించారు. కేసీఆర్ సర్కారు రైతు బంధు కోసం సిద్ధంగా ఉంచిన రూ.7,500 కోట్లను రైతుల ఖాతాల్లో జమచేయకుండా గుత్తేదారుల గుమ్ములు నింపుతున్నదని ధ్వజమెత్తారు. పెద్దపల్లిలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శనివారం ప్రారంభమైన 36 గంటల రైతు నిరసన దీక్ష ఆదివారం సాయంత్రం ముగిసింది. దీక్షలో కూర్చున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి, దాసరి, జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్‌కు నిరంజన్‌రెడ్డి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్‌ను బద్నాం చేసేందుకే కాంగ్రెస్ సర్కారు ప్రమాణ స్వీకారం చేయకముందే కాళేశ్వరం ప్రాజెక్టును ఖాళీ చేసిందని విమర్శించారు. మేడిగడ్డలోని 80 పిల్లర్లలో రెండు కుంగితే మరమ్మతు చేయకుండా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. దీంతో వేసిన పంటలు ఎండిపోతు న్నాయని చెప్పారు. రేవంత్ సర్కార్ రైతులకు నష్టం చేస్తే ఊరుకునేది లేదని, ఆదుకునే దాకా వారిని నిద్రపోనివ్వం.. మేం నిద్రపోమని హెచ్చరించారు. కేసీఆర్ తన పాలనలో ఎవుసాన్ని పండుగ చేసి తెలంగాణను దేశానికే అగ్రగామిగా నిలిపారని గుర్తు చేశారు. విపత్తులతో నష్టపోయిన పంటలపై సర్వే చేయించి ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం అందించిన ఘనత కేసీఆర్ సర్కార్‌కే దక్కుతుందన్నారు. వంద రోజుల్లోనే రాష్ట్రానికి శని పట్టిందని, హోల్‌సేల్‌గా ప్రజలను దగా చేయడమే కాంగ్రెస్ సర్కార్ పనిగా పెట్టుకున్నదని దుయ్యబట్టారు. పంటలు ఎండిపోయి రైతులు ఇబ్బందుల్లో ఉంటే సీఎం, మంత్రులు ఢిల్లీకి చక్కర్లు కొట్టడం హాస్యాస్పదమన్నారు. ఎండిన పంటలకు ఎకరాకు రూ.25వేల చొప్పున నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌కు, బీజేపీలకు పార్లమెంట్ ఎన్నికల్లో పోటీకి అభ్యర్థుల్లేక మందికి పుట్టిన బిడ్డలను మావాళ్లని ముద్దాడిన చందంగా సిగ్గులేకుండా బీఆర్ఎస్‌కు చెందిన నాయకులను చేర్చు కొని టికెట్లు ఇస్తున్నారని మండిపడ్డారు. పెద్దపల్లి పార్లమెంట్ నుంచి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించి కాంగ్రెస్‌కు తగిన బుద్ధిచెప్పాలని కోరారు.ఇక్కడ సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్ సింగ్, డీసీఎమ్మెస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ పాల్గొన్నారు.



దీక్షకు హాజరైన నాయకులు, కార్యకర్తలు, రైతులు

కరీంనగర్‌లో సమావేశమైన పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, నాయకులు



**రైతన్నల విషయంలో దాష్టీకంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సమరశంఖం పూరించారు. జిల్లాల్లో పర్యటిస్తూ అన్నదాతకు అండగా ఉన్నానని భరోసా కల్పిస్తున్నారు. ఆదివారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పర్యటించిన ఆయన, ఈ నెల 5న ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పర్యటించనున్నారు. కరీంనగర్, చొప్పదండి, వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గాల్లో ఎండిన పంటలను పరిశీలిస్తారని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తెలిపారు. కరీంనగర్ రూరల్ మండలంలోని ముగ్దుంపూర్, చెర్లభూత్కూర్‌లో మొదలయ్యే కేసీఆర్ పర్యటన సిరిసిల్లలోని పార్టీ కార్యాలయంలో ప్రెస్‌మీట్‌తో ముగియనున్నది.**

**- కరీంనగర్, మార్చి 31 (నమస్తే తెలంగాణ)**

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ తెచ్చిన అనేక సంస్కరణలు, వినూత్న పథకాలు వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చాయి. అనేక కష్ట నష్టాలకు ఓర్చిన కేసీఆర్ సర్కారు రైతులకు అండగా నిలిచింది. కాంగ్రెస్ ప్రభుత్వం చేతగాక వదిలేసిన అనేక ప్రాజెక్టులను పూర్తి చేయడంతో పాటు కాళేశ్వరం వంటి మహా ప్రాజెక్టుల నిర్మాణంతో రైతాంగానికి నిండు వేసవిలోనూ పుష్కలంగా నీటిని అందించింది. మండే ఎండల్లోనూ మారుమూల గ్రామాల్లో చెరువులు, కుంటలు మత్తళ్లు దుంకే పరిస్థితిని తీసుకువచ్చింది. ఏటా రెండు పంటలు తీసి ధాన్యపు రాసులు పండించిన రైతన్నలకు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే పాత రోజులను గుర్తుకు తెచ్చింది. రైతు రుణాలు మాఫీ చేస్తామని, రైతుబంధు పెంచి అందిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ఒక్కటి కూడా అమలు చేయలేదు. సాగునీరు లేక పంటలు కండ్ల ముందే ఎండి పోతుంటే రైతులు దుఃఖ సాగరంలో మునిగిపోయారు. ఈ పరిస్థితుల్లో రైతులకు అండగా నిలబడి, ఎండిన పంటలను పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ అధినేత జిల్లాల్లో పర్యటిస్తున్నారు. అందులో భాగంగా కరీంనగర్ ఉమ్మడి జిల్లాకు రానున్నారు.

### వంద రోజుల పాలనలోనే కరువు

ఉమ్మడి రాష్ట్రంలో రైతులు ఎలాంటి కష్టాలైతే పడ్డారో మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు వచ్చిన వంద రోజుల్లోనే అవే కష్టాలను అనుభవిస్తున్నారు. జిల్లాలో సాగు చేసిన పంటలు నీళ్లు లేక ఎక్కడిక్కడ ఎండి పోతున్నాయి. ఇది భరించలేని రైతులు రోడ్లెక్కి ఆందోళన చేస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు రైతుల సంక్షేమం గురించి పాటుపడిన బీఆర్ఎస్ అధికారంలో లేకున్నా వారికి అండగా నిలుస్తోంది. ముఖ్యంగా వరద కాలువకు నీళ్లు ఇవ్వాలని చొప్పదండి నియోజవర్గంలో రైతులు ఆందోళనకు దిగారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ వారికి అండగా నిలువగా, దిగివచ్చిన సర్కారు ఆదివారం వరద కాలువకు 0.1 టీఎంసీ నీటిని విడుదల చేయాలని అధికారులను ఆదేశించింది. ఎస్సారెస్పీ పరిధిలోని అనేక డిస్ట్రిబ్యూటరీల కింద ఎండుతున్న పంటలను రక్షించాలని పెద్దపల్లిలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ 36 గంటల పాటు నిరసన దీక్ష చేపట్టారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఉమ్మడి జిల్లా పరిధిలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా రైతులకు అండగా నిలిచి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ నేపథ్యంలో జరుగుతున్న కేసీఆర్ పర్యటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నది. రైతులు కూడా కేసీఆర్‌కు తమ బాధలు, సాగు నీటి కోసం పడుతున్న కష్టాలను చెప్పుకునేందుకు సిద్ధమవుతున్నారు.

### భరోసా కల్పించేందుకు..

ఎండిన పంటలను పరిశీలించి రైతులకు అండగా ఉన్నామని భరోసా కల్పించేందుకు బీఆర్ఎస్ అధినేత ఈ నెల 5న ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు కరీంనగర్ మండలంలోని ముగ్దుంపూర్, చెర్లభూత్కూర్‌లో ఎండిన పంటల పరిశీలనతో పర్యటన మొదలవుతుంది. ఇక్కడి రైతులతో ముఖాముఖి నిర్వహిస్తారు. అక్కడి నుంచి చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధర, బోయినపల్లి మండలాల్లో, వేములవాడ నియోజకవర్గంలోని వేములవాడ మండలంలో ఎండిన పంటలను పరిశీలిస్తారు. తర్వాత సిరిసిల్ల బీఆర్ఎస్ కార్యాలయంలో ప్రెస్‌మీట్ నిర్వహిస్తారు.

### బీఆర్ఎస్ నాయకుల సమావేశం

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటన నేపథ్యంలో కరీంనగర్‌లోని పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ నివాసంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్, వినోద్‌కుమార్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, తదితర ముఖ్యనాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఈ నెల 5న కేసీఆర్ పర్యటిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో దగాపడిన రైతన్నకు అండగా నిలిచేందుకు కేసీఆర్ పొలం బాట పట్టారని తెలిపారు.ఎండి పోయిన పంటలను పరిశీలించి, రైతులతో ముఖాముఖి నిర్వహిస్తారని చెప్పారు. సమావేశంలో నాయకులు గెల్లు శ్రీనివాస్ యాదవ్, ఏనుగు రవీందర్ రెడ్డి, గడ్డం చుక్కారెడ్డి, ద్యావ మధుసూదన్‌రెడ్డి, శ్రీనాథ్ గౌడ్, అజిత్ రావు, సిద్ధం వేణు, జక్కుల నాగరాజు పాల్గొన్నారు.



# వినోద్‌ను గెలిపిద్దాం

- అలాంటి మేధావులు తెలంగాణకు అవసరం
- అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ ఆయన
- తిట్ల పురాణంలో పీహెచ్‌డీ చేసిన బండి
- తెలంగాణపై ప్రేమ లేని సీఎం
- రేవంత్‌కు ముఖ్యమంత్రి పదవి కేసీఆర్ భిక్ష
- ఢిల్లీకి గులాంగిరి తప్ప ఆయనకు ఆత్మగౌరవం తెల్వదు
- ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్
- అల్గునూర్‌లో విద్యార్థి, యువకుల సమ్మేళనానికి హాజరు
- రైతులపై ప్రేమ లేని సర్కారుకు బుద్ధి చెప్పాలి : వినోద్‌కుమార్



తిమ్మాపూర్, మార్చి31: బీఆర్ఎస్ కరీంనగర్ అభ్యర్థి వినోద్‌కుమార్ అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ అని, ఆయనను గెలిపించుకుంటే కరీంనగర్‌కే కాకుండా తెలంగాణకు ఒక అభివృద్ధి కేంద్రంగా ఉంటారని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఆయన లాంటి మేధావులు తెలంగాణకు అవసరమని చెప్పారు. మండలంలోని అల్గునూరులో గల లక్ష్మీనరసింహ గార్డెన్‌లో మానకొండూరు నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ విద్యార్థి, యువజన కార్యకర్తల సమ్మేళనం పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించగా, ఆయన బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ కలిసి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఎన్నడూ జై తెలంగాణ అననోడు.. రాష్ట్రం మీద ప్రేమ లేనోడు మన ముఖ్యమంత్రి కావడం మన దురదృష్టకరమని తెలిపారు. ఎన్నో ఏండ్లు పోరాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రానికి.. నేడు రేవంత్‌రెడ్డి సీఎంగా ఉన్నాడంటే అది కేసీఆర్ పెట్టిన భిక్షేనని స్పష్టం చేశారు. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పదేళ్ల పాలనకు.. ప్రస్తుత పాలన చూస్తే రాష్ట్రంపై రేవంత్‌కు ఉన్న ప్రేమ అర్థమవుతుందన్నారు. నాడు మార్చిలో కుంటలు మత్తళ్లు దుంకితే.. నేడు ఎండిపోయి, బావులు, బోర్లు అడుగంటి కరువు కనిపిస్తుందని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు నిరసనగా ఢిల్లీలో చంద్రబాబు ధర్నా చేస్తుంటే ఆయన టెంట్ కింద కూర్చుని ఉన్న రేవంత్‌కు స్వరాష్ట్ర కాంక్ష, ఆత్మగౌరవం ఏం తెలుస్తుందని ప్రశ్నించారు. చిన్న పదవి వచ్చినా అమరులకు నివాళులర్పించే సంస్కృతి మనదని, రేవంత్‌రెడ్డి ఉన్నత పదవి చేపట్టినా ఇప్పటి వరకు 'జై తెలంగాణ' అనడం గానీ, అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించడం కానీ చేయలేదని విమర్శించారు. ఆయనకు ఢిల్లీకి గులాం గిరి చేయడం, సీఎం సీటు తప్ప తెలంగాణ ఆత్మగౌరవం తెలియదని ఎద్దేవా చేశారు. సెక్రటేరియట్ ఎదుట తెలంగాణ తల్లి విగ్రహం పెట్టేందుకు నాటి సీఎం కేసీఆర్ ఏర్పాట్లు చేస్తే, ఆ స్థానంలో తెలంగాణకు సంబంధం లేని రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టేందుకు రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని, ఢిల్లీ బానిసత్వానికి ఈ ఒక్క సంఘటన చాలు అని మండిపడ్డారు. కఠోర శ్రమతో ఉద్యమించి రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ లేకుంటే ఈ రోజు రేవంత్‌కు సీఎం పదవి, పీసీసీ అధ్యక్ష పదవి ఎక్కడిదని ప్రశ్నించారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానంటున్న రేవంత్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధిని ఆనవాళ్లు లేకుండా చేస్తున్నారని, ఆయనకు ఇంత అహంకారం ఎందుకని ప్రశ్నించారు. ప్రస్తుత ఎంపీ బండి సంజయ్ పార్లమెంటుకు పోతే నోరు తిరగదని ఎద్దేవా చేశారు. ఒక్కరోజు కూడా సమస్యలపై మాట్లాడని బండి కావాలా..?, కరీంనగర్‌కు స్మార్ట్ సిటీ, హైవే రోడ్లు తెచ్చిన వినోద్ కుమార్ కావాలా? అని యువతను ప్రశ్నించారు. తిట్ల పురాణంలో బండి సంజయ్ పీహెచ్డీ చేశారని, ఓ వైపు రైతుల పంటలు ఎండుతుంటే.. బండి మాత్రం చెంగిచెర్ల వెళ్లి మత రాజకీయాలు చేశారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, నాయకులు రావుల రమేశ్, కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### వినోదన్న మన బలం

మానకొండూరు నియోజకవర్గనికి ఒక బలం కావాలంటే వినోద్‌కుమార్ గెలవాలి. ఆయనను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ఆయన ఎంపీగా ఉన్న సమయంలో నేను చాలా అభివృద్ధి చేశా. ఆయన ఓడిపోయాక మరొక టర్మ్‌లో కొంత వెనుకబడిపోయా. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల వైఫల్యాలు మరోసారి పునరావృతం కాకుండా కేడర్ అప్రమత్తంగా ఉండాలి. వినోద్‌కుమార్‌ను గెలిపించుకొని తీరాలి. కాంగ్రెస్ నాయకుల దౌర్జన్యాలు ఇప్పటికే పెరిగాయి. మనకు పెద్దదిక్కు వినోద్‌కుమార్ పదవిలో లేకపోతే మరింత ఇబ్బంది అవుతుంది. ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేసి కారు గుర్తును గెలిపించుకోవాలి.

**- మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్**

### నిబద్ధతతో పనిచేయాలి

కరీంనగర్ జిల్లా అభివృద్ధికి ఎంతగానో కృషిచేసిన వినోద్‌కుమార్‌ను అందరం కలిసికట్టుగా ఉండి గెలిపించుకోవాలి. ఎక్కడా సమన్వయం లోపించకుండా నిబద్ధతతో పని చేయాలి. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ గతంలో బీఆర్ఎస్ సర్కారు చేసిన అభివృద్ధిని వివరించాలి. వినోద్ కుమార్ గెలిస్తే తెలంగాణ నినాదం ఢిల్లీ స్థాయిలో ఉంటుంది.**- బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు**

### కాంగ్రెస్ సర్కారుకు బుద్ధి చెప్పాలి

రాష్ట్రానికి, కరీంనగర్ స్మార్ట్ సిటీ, హైవే రోడ్లకు రూ.కోట్ల నిధులు తెచ్చి చేసిన అభివృద్ధిని ప్రజలకు చెప్పుకోకపోవడం మేం చేసిన పెద్ద తప్పు. లక్షా 60 వేల ఉద్యోగాలు ఇచ్చిన కేసీఆర్ ఒక్కరోజు కూడా ఆర్డర్ కాపీలు ఇస్తూ ప్రచారం చేసుకోలేదు. కేసీఆర్ ప్రభుత్వం వేసిన ఉద్యోగాలను రేవంత్‌రెడ్డి ఇచ్చినట్టు ఫోజు కొట్టుకుంటూ ప్రచారం చేసుకోవడం విడ్డూరం. నేటి యువత తెలంగాణ ఉద్యమ చరిత్ర చదవాలి. నాటి, నేటి పరిస్థితులు తెలుసుకోవాలి. తెలంగాణ వచ్చిన వెంటనే కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి 125 అంతస్తుల ఎత్తు అంత ఉండే మల్లన్నసాగర్‌కు నీటిని అందించిన ఘనత కేసీఆర్‌ది. కాళేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణ కోటి ఎకరాల మాగాణిగా మారింది. బీఆర్ఎస్ పాలనలో ఒక్క బావిలో కూడా పూడిక తీయలేదు. ఇప్పుడు ఎక్కడ చూసినా బావుల తవ్వకాలు కనిపిస్తున్నాయి. రైతులు, తెలంగాణపై ప్రేమలేని సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి. నన్ను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తా.

**- బీఆర్ఎస్ కరీంనగర్ అభ్యర్థి వినోద్‌కుమార్**



హాజరైన నాయకులు, కార్యకర్తలు

# నీటి విడుదల బీఆర్ఎస్ విజయం

- ఉదయం ధర్నాతో సాయంత్రానికి దిగివచ్చిన సర్కారు
- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- గాయత్రీ పంప్‌హౌస్ వద్ద పూజలు



గాయత్రీ పంపుహౌస్ వద్ద పూజలు చేస్తున్న సుంకె రవిశంకర్

గంగాధర, మార్చి 31/రామడుగు(చొప్పదండి) : వరదకాలువకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఉదయం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కొండన్నపల్లి వరదకాలువ వద్ద ధర్నా చేయడంతో కాంగ్రెస్ ప్రభుత్వం దిగివచ్చి సాయంత్రం నీటిని విడుదల చేసిందని, ఇది బీఆర్ఎస్ విజయమని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ స్పష్టం చేశారు. అర్ధరాత్రైనా అపరాత్రైనా రైతులకు బీఆర్ఎస్ అండగా ఉండి పోరాడుతుందని చెప్పారు. కాగా, వరద కాలువకు నీటిని విడుదల చేయడాన్ని స్వాగతిస్తూ ఆయన రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రీ పంపుహౌస్ వద్ద రాత్రి పూజలు చేశారు. సాగు నీరు లేక పంటలు ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడుతుంటే కాంగ్రెస్ సర్కారు పట్టించుకోక పోగా, కనీసం ప్రణాళికలు కూడా చేయకపోవడం చేతగానితనానికి నిదర్శనం అని మండిపడ్డారు. రైతులకు ఎలాంటి కష్టాలు వచ్చినా రైతుల పక్షాన నిలబడతామని, వారికి న్యాయం చేయడమే బీఆర్ఎస్ కర్తవ్యమని స్పష్టం చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు ఉన్నారు.



పీవీ కుటుంబ సభ్యులకు స్వాగతం పలుకుతున్న సంఘాల ప్రతినిధులు

# పీవీ కుటుంబానికి ఘన స్వాగతం

కమాన్‌చౌరస్తా, మార్చి 31 : బహుభాషా కోవిదుడు, మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం 'భారతరత్న' ప్రకటించగా, శనివారం ఢిల్లీలో పీవీ కుటుంబ సభ్యులు పురస్కారం అందుకున్నారు. ఈ క్రమంలో వారు తిరిగి హైదరాబాద్‌కు చేరుకున్న సందర్భంగా ఆదివారం శంషాబాద్ ఎయిర్ పోర్టులో పీవీ కూతురు ఎమ్మెల్సీ సురభి వాణీదేవికి ఘనస్వాగతం పలికారు. ఇందులో భాగంగా బ్రాహ్మణ సంఘాల ఐక్య వేదిక తరపున ఘనంగా సత్కరించారు. ఇక్కడ బ్రాహ్మణ ఐక్యవేదిక నాయకులు ప్రమోద్ కోటార్, మంగు రాఘవరావు, టీబీఎస్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మునిపల్లె శ్రీనివాస్, బ్రాహ్మణ సంఘాల నాయకులు ఉన్నారు.